కార్మికుల భద్రతపై దృష్టిసారించాలి

కార్మికులను పట్టించుకోకపోవడం బాధాకరం
అధికారులు పారిశ్రామికవేత్తలతో కుమ్మక్కయ్యారు
సౌత్ గ్లాస్ పరిశ్రమ ప్రమాద క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సౌత్ గ్లాస్ పరిశ్రమ వద్ద కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జూన్29: అధికారులు పారిశ్రామిక వేత్తలతో కుమ్మక్కయ్యారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై స్పందించిన ఆయన అధికారులు, పరిశ్రమ యాజమాన్యం పనితీరును తప్పుబట్టారు. పరిశ్రమలో నాణ్యత లోపించిన యత్రాలను వినియోగించడం వలనే ప్రమాదం చోటుచేసుకుందని, కేవలం లాభాలపై దృష్టిపెట్టారే తప్పా కార్మికుల భద్రతపై యాజమాన్యాలకు శ్రద్ధలేదని మండిపడ్డారు. పరిశ్రమల శాఖ అధికారుల పర్యవేక్షణ సహితం కొరవడిందని, ఈ తరహా ఘటనలు పునారవృతం అయితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. షాద్‌నగర్ పట్టణంలోని వైద్యాన్ని పొందుతున్న పరిశ్రమ కార్మికులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అన్ని పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో జెట్పీటీసీ పి. వెంక ట్రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలం చింత గూడ గ్రామంలో రూ.40 లక్షలతో రోడ్డు కల్వర్టు పనులు, ఎలి కట్ట గ్రామంలో రూ. 15 లక్షలతో గౌడ సంఘం భవనం, రూ. 20లక్షలతో స్కిల్ డెవలప్‌మెంట్ భవనం, కొందుర్గు మండలం పర్వాతాపూర్‌లో రూ. 30 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. విడుతల వారీగా గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెట్పీటీసీ పి. వెంకట్రాంరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల ఏకపక్ష ధోరణి సరికాదు

అధికారపార్టీకి కొమ్ముకాస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులు
బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జంగయ్య ముదిరాజ్

సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య ముదిరాజ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 29 : పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అధికార పార్టీకి కొమ్ముకాయటం సరైన పద్ధతి కాదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రవణ మోని జంగయ్య ముదిరాజ్ శనివారం అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని దండుమైలారం గ్రామంలో గంజాయి మత్తులో యువత ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని గతంలో ఎన్నిసార్లు పోలీసులను ఆశ్రయించినప్పటికీ పట్టించుకోకుండా, మూడురోజుల క్రితం గ్రామంలో గంజాయి మత్తులో ఓ యువకుడు గ్రామానికి చెందిన యువతిపై దాడిచేసిన విషయంలో పోలీసులు గ్రామంలోని ప్రజలందరితో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్ మల్లీశ్వరి జంగయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్, బీజేపీతో పాటు పలు పార్టీల నాయకులకు సమాచారం ఇవ్వకుండా కేవలం కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించటం ఎంతవరకు సమంజసమన్నారు. గ్రామంలోని సమస్యను గ్రామ ప్రజలందరి ముందు చర్చించాల్సిన పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అధికారపార్టీకి కొమ్ముకాయటం సరైన పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా పోలీసులు ఏకపక్ష ధోరణివీడి అందరిని సమానంగా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్, జూన్ 29 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలిక, బాలుర పాఠశాల/కళాశాలలో అధ్యాపకులు, ఉపాధ్యాలుగా పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు గురుకుల విద్యా సంస్థల పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ శారద శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల విద్యాలయాల్లో తెలుగు, ఆంగ్లం, గణితం, సాంఘిక శాస్త్రం, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం, వృక్ష శాస్త్రం, అర్థ శాస్త్రం, రసాయన శాస్త్రం, జంతు శాస్త్రం, పౌర శాస్త్రాలలో బోధించడానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు కావాలని చెప్పారు. అదే విధంగా లైబ్రేరియన్, పీఈటీలుగా పని చేయడానికి కావాలని అన్నారు. అభ్యర్థులు పీజీ, బీఈడీ, జీఎన్ఎం, బీపీఈడీ, బీఎల్ఐసీ విద్యార్హతలు కలిగి ఉండాలని చెప్పారు. ఆసక్తి గల వారు మండల పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాలలో జూలై 3వ తేదీన 9 గంటల నుంచి నిర్వహించే డెమోలో పాల్గొనాలని, అర్హత పొందిన ధ్రువీకరణ పత్రాలను తీసుకుని రావాలని సూచించారు.

ఉపయోగంలోకి కమ్యూనిటీ హాల్

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 29 : అబ్దుల్లాపూర్ గ్రామంలో అసంపూర్తిగా నిరుపయోగంగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతు పనులు చేపట్టారు. శనివారం ఎంపీపీ రేఖామహేందర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్‌పాషా, పంచాయతీ కార్యదర్శి తుల్జాప్రసాద్, ఏఈ సూర్యతేజ, నాయకులు బుర్ర లింగంగౌడ్, రమేశ్‌గౌడ్, లక్ష్మణ్, బాబయ్య, మహేశ్, శివ, మహిళలు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చేవెళ్ల రూరల్, జూన్ 29 : రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శనివారం ఎస్ఐ ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం.. చేవెళ్ల మండల పరిధి పామెన గ్రామానికి చెందిన బర్కని కృష్ణ, మంచన పల్లి బాలయ్య(65) ఇద్దరు కలిసి ఈ నెల 27న వారి బైక్‌పై వెళ్తున్న క్రమంలో చేవెళ్ల నుంచి షాబాద్ చౌరస్తాలో యూటర్న్ తీసుకుంటుండగా షాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి వీరిని ఢీకొట్టాడు. దీంతో కృష్ణ, బాలయ్యకు తీవ్ర గాయాలు కావడంతో ఉస్మానియాకు తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం బాలయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రదీప్ కుమార్ తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

యాచారం, జూన్29: పీఏసీఎస్ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నట్లు చైర్మన్ రాజేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సహకార శాఖ ఆదేశాల మేరకు రైతుబంధు (రైతు బరోసా) పథకంపై రైతుల సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ప్రత్యకంగా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మేడ్చల్ డిప్యూటీ రిజిస్ట్రర్, ఆడిట్ అధికారి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

స్పందన.. ప్రాణాలకు రక్షణ

పెద్దఅంబర్‌పేట, జూన్ 29: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ, అల్కపురిలోని నక్షత్ర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గోల్డెన్ అవర్ ట్రామా, కంప్రెషన్స్ ఓన్లీ లైఫ్ సపోర్ట్ (సీపీఓఎల్ఎస్)పై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నపాటి ఆలస్యం కారణంగా ఏ ఒక్క ప్రాణమూ పోకూడదని వైద్యులు పేర్కొన్నారు. వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మీ స్పందనే ఎవరో ఒక ప్రాణం రక్షించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో శ్రేయాస్ కాలేజీ వైస్ చైర్మన్ హృదయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కే సాగర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాగ లత, నక్షత్ర హాస్పిటల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మహబూబ్ బాషా, మేనేజర్ హర్ష, నక్షత్ర హాస్పిటల్స్ సీఈవో, ఎండీ సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తిసాగులో విత్తన శుద్ధి తప్పనిసరి

పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సుధారాణి

కొత్తూరు, జూన్ 29: పత్తిసాగులో విత్తన శుద్ధి తప్పనిసరి అని అగ్రానమి శాస్త్రవేత్త సుధారాణి అన్నారు. మండలంలోని రెడ్డిపాలెంలో శనివారం పత్తి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి విత్తన శుద్ధిలో భాగంగా కిలో విత్తనానికి 5 గ్రాములు ఇమిడాక్లోప్రిడ్ కానీ థయామిక్సిన్ 4 గ్రాములతో విత్తన శుద్ధి చేయాలన్నారు. దీంతో పంట తొలిదశలో ఆశించే చీడపీడ బెడదను తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు రాయపురెడ్డి, ప్రదీప్, ఏఈవో దీపిక పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి నాయకుల పరామర్శ

యాదయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్, జూన్ 29: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మండలంలోని ముద్విన్ గ్రామ మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య కుటుంబాన్ని, శనివారం ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ సభ్యుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా యాదయ్య చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ యాదయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. యాదయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు భీక్యానాయక్, హీరాసింగ్, లక్ష్మయ్య, జహంగీర్‌అలీ, జగన్, సురేందర్‌రెడ్డి, అశోక్, లక్పతినాయక్, నర్సింహ, మధు, సత్యనారాయణ ఉన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి

చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్
చేగూరులో రైతుబంధు పథకంపై అభిప్రాయ సేకరణ

నందిగామ, జూన్ 29: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చేగూరు పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్ అన్నారు. శనివారం చేగూరు పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో రైతు భరోసా పథకంపై పీఏసీఎస్ చైర్మన్ అశోక్ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. రైతులకు పెట్టుబడి సాయం సమయానికి అందించాలని, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ అశోక్ మాట్లాడుతూ.. రైతులకు అన్ని విధాలుగా ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మారావు, డైరెక్టర్లు నర్సింహులుగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, మల్లేశ్, నర్సింహ, మారెడ్డి, యాదిరెడ్డి, సాయన్న, బాలమ్మ, పాండు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం

కడ్తాల్, జూన్ 29: జీవితంలో మధురమైన జ్ఞాపకాలు ఫొటోలలో సజీవంగా ఉంటాయని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో, అంతర్జాతీయ కెమెరా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్లు కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం ఉపాధ్యక్షుడు రబ్బాని, కార్యదర్శి కిరణ్‌కుమార్, సభ్యులు నదీమ్, శివ, మహేశ్, కృష్ణ పాల్గొన్నారు.

మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

మొయినాబాద్, జూన్ 29 : ప్రభుత్వం డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ అన్నారు. మండల పరిధిలోని పద్మాపతి గార్డెన్‌లో శనివారం డ్రైవర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు గోపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ ప్రజాపాలనలో డ్రైవర్ల జీవితాలు దుర్భరంగా మారానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించడంతో డ్రైవర్లు రోడ్డు మీద పడి వారి కుటుంబాలు కూడా గడవని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లను ఆదుకోవడానికి ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. రూ.10 లక్షల ప్రమాద బీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు మోహన్‌రావు, యూనియన్ ప్రధానకార్యదర్శి శేఖర్, సభ్యులు మల్లారెడ్డి, సుధాకర్, రాజు, బాలస్వామి, మహ్మద్ చాంద్ పాషా, మహేందర్, గోరేమియా, మల్లేశ్, మహేందర్, శ్రీనివాస్, అంజి పాల్గొన్నారు.

పాఠశాలలకు తాగునీటి వసతి కల్పించాలి

యాచారం, జూన్29: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు తప్పనిసరిగా తాగునీటి వసతిని కల్పించాలని ఎంపీపీ కొప్పు సుకన్యభాష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతి పాఠశాలకు పైప్‌లైన్లు వేసి నీటి వసతిని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత మిషన్ భగీరథ అధికారులదేనన్నారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో విద్యా, వైద్యం, విద్యుత్, తాగునీరుపై ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత నివ్వాలన్నారు. ప్రజాపాలన కోసం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో ఉమారాణి, మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

తుర్కయాంజాల్, జూన్ 29 : రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం తుర్కయాంజాల్ రైతుసేవా సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో సర్వసభ్య సమావేశం సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని అన్నారు. రైతు భరోసాపై సంఘం సభ్యులు, రైతుల సూచనలు తీసుకొని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. సమావేశంలో రైతు బంధు సమితి రంగారెడ్డి జిల్లా మాజీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ రాందెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, యాదగిరి, లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సంఘం సీఈవో రాందాస్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు పునఃప్రారంభం

వాహనదారులకు తప్పనున్న తిప్పలు

ఇబ్రహీంపట్నం, జూన్ 29 : హైదరాబాద్ నాగార్జునసాగర్ రహదారిపై నిర్మాణం చేపట్టిన వంతెన అసంపూర్తిగా నిలిచిపోవటంతో ఈ ప్రాంతానికి చెందిన పలువురు రాజకీయ నాయకులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ అధికారులు శనివారం వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సమస్యకు పరిష్కారం గుర్తించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణం కోసం రూ.3కోట్లు కేటాయించింది. నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించాలంటూ బీజేపీ, సీపీఎంల ఆధ్వర్యంలో పలు దఫాలుగా ఆందోళనలు చేపట్టారు. దీంతో శనివారం అధికారులు వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు.

భూ బాధితులకు న్యాయం చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 29 : మండలంలోని మజీద్‌పూర్ సీలింగ్ భూ బాధితులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరుతూ శనివారం తహసీల్దార్ రవీందర్‌దత్తుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలో 1969లో 243.31 ఎకరాల భూమిని పున్మత్స ప్రభావతి భర్త రాజన్‌రాజు, వెంకట్‌రాజు తండ్రి పీఎన్ రాజు, బుచ్చి వెంకాయమ్మ భర్త రామకృష్ణ రాజు కొనుగోలు చేసిన భూమి 1973 సీలింగ్ యాక్టు ప్రకారం భూ సంస్కరణల ద్వారా 1993లో తమ గ్రామానికి చెందిన సుమారు 40 మందికి సర్వేనంబర్ 161, 162, 163, 74, 76, 77, 83, 84, 87, 88, 89లలో 132 ఎకరాలు పంట భూములకు సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగిందని తెలిపారు. నేటి వరకు భూమిని కబ్జాలో ఉంటూ తెలిపారు. ఈ భూమిని రెవెన్యూరికార్డుల్లో చేర్చి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని అనేక దఫాలుగా రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు ఇస్తూ వస్తున్నామని వివరించారు. 1993 నుంచి దశాబ్దాల కాలంగా తమకు న్యాయం జరుగడంలేదని వాపోయారు. ఇప్పుడైనా ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. సర్వే నంబర్ 161, 162, 163, 74, 87, 88, 89లలో కొందరు నకిలీ సర్టిఫికెట్ల ద్వారా అమ్మకరాలు/కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. వీటిని రద్దు చేసి తమకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరారు. తమ సమస్యకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక ఇచ్చి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాంటేకార్ రమేష్‌జీ, మేడిపల్లి నర్సింహాగౌడ్, బాధిత రైతులు కె.సాయికుమార్, జి.బాలయ్య, వై.రమేశ్, కృష్ణ, కె. నర్సింహ, సీహెచ్ లింగస్వామి, హరి కృష్ణ, కె.యాదయ్య, శంకర్‌గౌడ్, సత్తయ్య, దర్శన్, చిన్నయాదయ్య, వీరయ్య, రామస్వామి, అంజయ్య, సాలయ్య, బాల్‌శెట్టి, శ్రీశైలం, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మజీద్‌పూర్ సీలింగ్ భూ బాధితులు

నిరసన దీక్ష చేపట్టిన ఏబీవీపీ నాయకులు

కస్తూర్బా గాంధీ భవనాన్ని ప్రారంభించాలి

కడ్తాల్, జూన్ 29: మండల కేంద్రంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ, శనివారం ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో నిరసన దీక్ష చేపట్టిన ఏబీవీపీ నాయకులకు... బీజేపీఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటేకార్ భగీరథ్, దోనాదుల మహేశ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ మాట్లాడుతూ కేజీబీవీ భవనాన్ని వెంటనే ప్రారంభించి తరగతులను మొదలుపెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మురళీ, భరత్, మల్లేశ్, పవన్, మధు, శివ, ప్రవీణ్, అనిల్, భద్రు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు

చేవెళ్ల రూరల్, జూన్ 29 : చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి గ్రామం నుంచి ముడిమ్యాల్ గ్రామ ప్రధాన రహదారి 2కిలో మీటర్ల వరకు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో స్పందించిన కేసారం మాజీ సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్, ముడిమ్యాల్ పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్ సొంత నిధులతో శనివారం రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావులపల్లి టూ ముడిమ్యాల్ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని, ప్రయాణించడానికి వీలులేకుండా ఉండడంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గుంతల్లో పూర్తిగా మట్టిని పోయించి చదును చేయించామని తెలిపారు.

సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలి

మంచాల, జూన్ 29: సహకార సంఘం అభివృద్ధి పథంలో పయనించాలంటే ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా అధికారులు, డైరెక్టర్లు కలిసి పనిచేయాలని సహకార సంఘం చైర్మన్ వెదిరె హనుమంతరెడ్డి అన్నారు. శనివారం మంచాల సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు గతంలో తీసుకున్న రుణాలను చెల్లించినట్లైతే వారికి తిరిగి కొత్త రుణాలను అందజేయనున్నట్లు చెప్పారు. రూ.2లక్షల రుణమాఫీ కోసం సహకార సంఘం బ్యాంకు నుంచి 18వందల మంది రైతుల వివరాలను జిల్లాస్థాయి అధికారులకు పంపించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు జెనిగ వెంకటేశ్, పి.రమేశ్, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, బ్యాంకు సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లప్పుడూ సేవలు అందిస్తాం

ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న ఎంపీటీసీలు, తదితరులు

చేవెళ్లటౌన్, జూన్ 29: మండల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎంపీపీ మల్గారి విజయలక్ష్మి రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాలకవర్గం ఏర్పాటై జూలై 4వ తేదీకి ఐదేండ్లు పూర్తవుతుందని, పదవులు ఉన్నా లేకున్నా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీడీవో, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మంచాల, జూన్ 29: తెలంగాణ ఉద్యమకారుడు బీఆర్ఎస్ నాయకుడు దేవరకొండ శేఖర్ మృతి బాధకరమని బీఆర్ఎస్ మండల నాయకుడు ఇటికల ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంచాల మండలం చీదేడు గ్రామానికి చెందిన దేవరకొండ శేఖర్ అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామ బీఆర్ఎస్ యువత వారి కుటుంబానికి అండగా ఉండాలనే లక్ష్యంతో శనివారం రూ. 50వేల రూపాయల ఆర్థిక సాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శెట్టిమల్ల వెంకటేష్, పంతం వెంకటయ్య, పోలమోని శివ, లింగం, రామాచారి, యాదేశ్వర్, మహేష్, కిరణ్, సాయి, శంకర్, సీపీఎం నాయకులు శ్యాంసుందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

చేవెళ్ల రూరల్, జూన్ 29 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. శనివారం చేవెళ్ల మండల పరిధిలోని దామరగిద్ద ఎక్స్ రోడ్డు వద్ద